# వంకర

"ఏదీ పాడు చూద్దాం! నీ పేరేమిటి?"

"దాని పేరు అష్టావక్ర!" ఒక్కసారి పది గొంతులు అరిచాయి.

ఆ పిల్ల పెద్ద కళ్ళతో వెనక్కి తిరిగి క్లాసు కలియజూసింది. నా వైపు తిరిగి "శారద..." అన్నది పాప.

ఆ పాప నడుం వంకరగా ఉండటంతో పక్కకు వరిగిపోయినట్లుగా ఉంది. ఒక కాలు బలహీనంగా ఉంది గావును మోకాలు మీద చేయి ఊతం చేసుకొని నడుస్తోంది.

"ఏం పాడతావు?"

"ప్రార్థనా గీతం..." అన్నది శారద.

జాలిజాలి గొంతు 'ప్రభూ నా తప్పు మన్నించు. నా ఆహారాన్ని నాకివ్వు...' అనే చిన్న కోరిక ఆ పాట. ఆకలి ఆర్తనాదం చేసినట్లుంది ఆ పాట వింటుంటే. నిజంగా శారద ఆకలితో అన్నం పెట్టవా అని అడుగుతున్నట్లే ఉంది. కొంపదీసి ఈ పిల్లల ముందు ప్రవాహం అయిపోను గదా! శారద పాట ఆపేసరికి నా కళ్ళు తడిసిన మాట వాస్తవం. ఆయాసంతో వేగంగా దమ్ము తీస్తోంది శారద. నల్లని మొహం కూడా కందిపోయినట్లు బుగ్గలు నిగనిగలాడుతున్నాయి. లేచి వెళ్ళి శారద చేయి పట్టుకున్నాను. కాలిపోతున్నది.

''అదేమిటమ్మ శారదా... జ్వరం వస్తే స్కూలుకు వచ్చావెందుకు?''

శారద ఓసారి పిల్లల వైపు చూసి మళ్ళీ నా వైపు తిరిగి ''జరం రాలేదు టీచర్'' అన్నది.

''లేదు టీచర్. దానికి జరం... అన్నం పెట్టరని జరం లేదంటోంది''

''బ్రెడ్, పాలూ తాగమ్మకదా?'' పెదవుల వెనకే మాట అణిగిపోయింది.

''సిడౌన్ శారదా...''

ఇంకో రెండు వంకరలు తిరిగితేనే గానీ శారద కూర్చోలేకపోయింది. బెత్తంతో బల్లమీద ఊరికే కొట్టి రెండుసార్లు ''సైలెన్స్'' అన్నాను. ఎందుకన్నానో అర్థం పర్థం లేకుండా. పిల్లలంతా నోరు మెదపకుండా కూర్చున్నారు.

''క్రమశిక్షణ నా ప్రాణం సుధా. డిసిప్లిన్‌లో ఉంచుతాను పిల్లల్ని'' అన్నారు హెడ్‌మిస్ట్రెస్ మంగమ్మగారు, వారంరోజుల క్రితం నా చేతిలో అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ వుంచుతూ.

'నిజమే... ఎవ్వరూ నోరెత్తరు. అసలలా ఎత్తే పని లేదు కూడా. అది వికలాంగుల సంక్షేమ పాఠశాల. మధ్యలో ఆ సంక్షేమం అన్న పదం తొలగిస్తే గానీ ఆ బోర్డు సక్రమంగా వుండదనిపిస్తోంది. ఇక్కడ పిల్లలంతా చూడటానికి చాలా విచిత్రంగా కనిపిస్తారు. ఒక అవయవ లోపాన్ని ఇంకో అవయవంతో సరిచేసుకోవటం విచిత్రం. ఒక చెవిటి పిల్లవాడు కళ్ళు దగ్గరగా చికిలించుకొని ముక్కు, మూతి విరుచుకుని మనం ఏం మాట్లాడుతున్నామో దీక్షతో రెప్పలార్పకుండా గమనిస్తుంటాడు. గుడ్డిపిల్లాడు కళ్ళు, చేతులు అన్నీ ఉపయోగిస్తూ అంధత్వం ఇబ్బంది నుంచి బయటపడాలని చూస్తాడు. దాదాపుగా చదువు ఎవరికీ బాగా రాదు. అంత శ్రద్ధ తీసుకొనే అవసరం టీచర్లకీ, వార్డెన్లకీ, పుట్టించి వాళ్ళని రోడ్డుపాలు చేసిన వాళ్ళకీ ఎవరికీ లేదు. ప్రపంచానికి బరువైన వాళ్ళు వీళ్ళు.

''శారదా... పోయి రెస్టు తీసుకుంటావా?''

''లేదు టీచర్ జరం లేదు టీచర్...'' అన్నది శారద చిలక మాటలు నేర్చినట్లు.

'శారదను హాస్టల్‌కు పంపితే రాత్రి దానికి అన్నం పెట్టరు టీచర్. డాక్టర్‌గారు పెట్టమంటేనే పెడతారు టీచర్' అన్నదో పిల్ల తల అడ్డంగా ఊపుతూ. అర్థం పర్థం లేకుండా బెత్తం మోగించాను నేను. ఏదో ఒకటి చేయకపోతే ముందు నన్ను నేను తట్టుకోవాలి కదా...'

''శీనూగెటప్... లేచి నిన్నటి పాఠం చదువు... ముందు వరసలో వాళ్ళంతా వల్లించండి''

పోలియోతో కుప్పకూలిన కాళ్ళతో దేకుతూ శీను ముందుకు వచ్చి పాఠం చదవటం మొదలుపెట్టాడు. హెడ్‌మిస్ట్రెస్, వార్డెనూ క్లాసు గుమ్మం ముందుకు వచ్చారు. ''సుధా టీచర్

రేపు మన స్టాఫ్ స్ట్రయికంటున్నారు మరి మీ సంగతేమిటి?''

''నాకు విషయం తెలియదండీ...'' అన్నాను.

మొదటి రోజు అపాయింట్‌మెంట్ ఆర్డర్ నా చేతికిస్తూ నన్ను చాలా పొగిడారు హెడ్‌మిస్ట్రెస్ మంగమ్మగారు.

''టీచర్‌గారు గోల్డు మెడలిస్ట్. మన పాఠశాలలో ఆమె పని చేయటానికి రావటం మన అదృష్టం. చాలా గొప్ప మానవతా దృక్పథంతో, సమాజ సేవాపేక్షతో....'' ఆవిడ పొగడ్తలు నా మనసులో ముల్లులాగా గుచ్చుకుంటున్నాయి. నేను అలాగనేం ఈ స్కూలుకు రాలేదు. జీతం నాకు నచ్చటంతోను, నా ఆర్థిక కారణాలతో మాత్రమే ఈ ఉద్యోగంలోకి వస్తి. రెండేళ్ళపాటు నేను డబ్బు సంపాదించుకోవాలి. ఆ తరువాత నా భర్తని ఆ డబ్బుతో కొనుక్కోవాలి. పెద్ద ప్రాజెక్ట్ వర్క్.. నా గ్రీటీనేసును చిరునవ్వుతో తొక్కి పెట్టి నమస్కారం పెట్టిన మహా నటిని నేను.

''అదేనమ్మా స్టాఫ్ జీతాలు ఇంకా పెంచాలనీ, పిల్లలకు రేషన్ ఇవ్వటం లేదనీ, ఈ మేనేజ్‌మెంట్‌ను మార్చాలని ఇవి వాళ్ళ డిమాండ్స్...''

''మాయరోగం కాకపోతే ఈళ్ళకేం తిండి తక్కువనీ, పోతుల్లాగా ఉన్నారు ఒక్కోడు'' అన్నాడు వార్డెన్ క్లాసంతా కలియజూసి.

నేనేం మాట్లాడలేదు. రెండు రోజులుగా చూస్తున్నా. అందరికీ కడుపులో నొప్పి కంప్లయింటే. దాదాపుగా ఎవరికీ తిన్నది అరగదు. ఇద్దరికో, ముగ్గురికో వాంతులవుతుంటాయి. ''ఊ పదండి టీచరుగారు చూసుకుంటార్లే. మీ ట్రెయినీలే అటెండవండి క్లాసులకి'' అన్నారు హెడ్‌మిస్ట్రెస్. దాదాపుగా సగం మంది ట్రెయినీలే. పర్మనెంట్ అయ్యే అవకాశాలు అతి తక్కువ. ఎయిడెడ్ స్కూలయినా జీతాలు సంతకాల్లో ఉన్నంతగా చేతుల్లోకి రావు. హెడ్‌మిస్ట్రెస్ గొంతు వినగానే పిన్‌డ్రాప్ సైలెన్స్. ఒక్కడు నోరెత్తలేదు నిజంగానే. గొప్ప డిసిప్లిన్. సాయంకాలం అలా హాస్టల్‌కు వెళ్ళాలనుకున్నాను. పిల్లలకు టీచర్లంటే చెప్పలేనంత భయం. ప్రపంచంలో ప్రతివాడూ వాళ్ళను దండించేందుకే ఉన్నాడన్నంత అనుమానం. పిల్లలు మురిగ్గా ఉన్నారు. చేతుల్లో, చెవుల్లో మురికి పేరుకుపోయింది. చాలామంది పిల్లలకు ఏకంగా గుల్ల. తలలో ముండ్రు పట్టి మొహం మీదకి కూడా పాకి పిల్లలు చూడబుద్ధి కాకుండా ఉన్నారు. వాళ్ళను కాస్త దగ్గరికి తీసి శుభ్రత గురించి చెపితే చాలు వాళ్ళంతా నిజంగా తెలివైన పిల్లలే.

ఏడు గంటలు దాటాక నా పనులన్నీ ముగించుకొని అలా హాస్టల్ వైపు వెళ్ళాను. కటిక చీకటి. గేటుకు తాళం వేసి ఉంది. భయం వేసింది ఒక్క క్షణం. మట్టూ ఇళ్ళల్లో, వీధిలో

లైట్లున్నాయి. ఒక్క హాస్టలే అంధకారంలో మునిగిపోయి నిశ్శబ్దంగా ఉంది. ''వీరాస్వామీ...'' వాచ్‌మెన్ కోసం చిన్నగా పిలిచాను. ''టీచర్'' పది గొంతులు గేటు పక్క నుంచే బదులు పలికాయి.

''ఎవరూ శీనూ? ఏమిటి అంతా గేటు దగ్గర చేరారు? కరెంటు పోయిందా?''

''లేదు టీచర్... లైట్లు వేయరు...'' అన్నాడు శీను.

''లైట్ వెయ్యకపోతే ఎట్లా? అన్నాలు తిన్నారా?'' అన్నాను. ఏవిటో లోలోపల గాభరాగా ఉంది.

''తిన్నాం టీచర్'' మళ్ళీ పది గొంతులు.

''ఏంటి టీచర్‌గారూ ఇల్లా వచ్చారు?'' అన్నాడు వీరాస్వామి. ఎటో తిరగటానికి వెళ్ళాడు కాబోలు వచ్చి తాళం తీస్తున్నాడు. గేటుకు ఆనుకునే అతని మంచం ఉంది.

కాస్త దూరంలో నేలమీద దుప్పట్లు పరుచుకొని పదిమంది చిన్నపిల్లలు పడుకొని ఉన్నారు.

''వీరాస్వామీ? కరెంటు లేదా?''

'వీరాస్వామీ లైటెందుకు వేయలేదు' అని డిమాండ్ చేయవలసిన గొంతుతో ఎంత సౌమ్యంగా ఆ మాట అన్నానో నాకే ఆశ్చర్యం.

''ఎందుకు లేదండీ! ఊరికే కరెంటు దండగ ఎందుకని లైట్లు వెయ్యవద్దన్నారు వార్డెనుగారు''

వీరాస్వామి వరండాలో లైట్లు వేశాడు.

పిల్లల గదులకు దూరంగా వార్డెను కోసం కేటాయించిన ఇంట్లో లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఎటొచ్చి దోమలు రాకుండా అంతా మెష్‌లు, కర్టెన్లు, ఎంత అందమైన, ముచ్చటైన ఇల్లో...

''ఇంతమంది పిల్లలున్నచోట లైట్లు వేయించకపోతే ఎట్లా వీరాస్వామీ?'' వీరాస్వామి నవ్వేడు.

''ఏందండీ టీచరుగారూ... ఇసిత్రాలు సెప్తుతారు. గుడ్డోళ్ళకి లైట్లెందుకండీ...''

బాధతో మనసు ఉంగలు చుట్టుకుపోయిందో, గిలగిలలాడిపోయిందో చెప్పను. అతి మామూలు గొంతు కోసం ప్రయత్నం చేశాను.

దుప్పట్లు పరుచుకొని పడుకున్న పసివాళ్ళ వైపు నా కళ్ళు తిరిగాయి. మెష్‌లూ లేవు...

దోమతెరలూ లేవు... తన సంతతి పట్ల ప్రేమకొద్దీ, పున్నమినాటి సముద్రపు వెల్లువ వలే, మాతృత్వపు మమకారం కొద్దీ ప్రకృతి వాళ్ళ కోసం విసిరిన చీకటి తెరలో, నిద్రలో తమని తాము మరిచిపోయి... ఆ మేలుకొని వున్న వీరాస్వామి అన్నట్లు కనిపిస్తాందా? వినిపిస్తుందా...?

''చిన్నగుంటలు కదండీ... పొద్దు వాలంగానే నిద్దర్లు పోతారు'' అన్నాడు వీరాస్వామి కుర్చీ తెచ్చి వేస్తూ. నిజంగానే నిస్సత్తువగా అనిపించింది. కుర్చీలో కూర్చుంటుంటే లైటు వెలుగులో, వరండాలో, కింద చెల్లాచెదురుగా పిల్లలు కొందరు పూర్తిగా అంధులు, మరికొందరు కాస్త కనిపిస్తుంది టీచర్ అంటారు తడుముకుంటూ... బట్టలెలా ఉతుక్కుంటారో... తిండెలా తింటారో... వీళ్ళ మొహాల్లోకి గలగలలాడుతూ నేలకి జారిన గవ్వలాంటి నవ్వుతెరలు ఎలాగొస్తాయో...

''వీరాస్వామి వరండాలో లైట్లు ఉంచండి. మిగతా పిల్లలు చదువుకుంటారు. పరీక్షలు దగ్గరికి రావటం లేదూ...'' అన్నాను గొంతులో తేడా ధ్వనించకుండా.

''సదువుకొనేదెవరూ... ఈల్నా... భలే చెప్పారు టీచరుగారు. తింటం... తొంగోటం...'' అన్నాడు విసురుగా వీరాస్వామి. ''ఖర్చులు కొన్ని తగ్గించాలన్నారు వార్డెనుగారు. ఫండ్లు అన్నింటికీ సరిపోవు గదండీ...''

'అయితే మాత్రం వరండాలో లైట్లు వేయి' అనే సాహసం మాత్రం నాకు లేదు. నా ఉద్యోగం, బ్యాంకు బాలెన్సు, కాబోయే భర్త, ఆ తరువాత నా సంసారం, పిల్లలు. నా భవిష్యత్ గురించి నేను ప్రతిరోజూ పడుకునే ముందు ఊహించుకునే కమ్మని కల. ప్రతిరోజూ ఓ పది నిమిషాలు నా నిద్రకి ముందు ఇందుకోసం కేటాయిస్తాను క్రమం తప్పకుండా. ఆ కలలో ఊహాలో ఖర్చులకు సంబంధించిన, పెళ్ళి, ఊరేగింపులు, దండలు, సన్నాయి వంటి సోది వ్యవహారం ఉండదు.

నా పెళ్ళయిపోతుంది. సాయంత్రం ఆరుగంటలవుతుంది. నేను, నా భర్త అలా బజారు షికారు వెళతాము. అతను మల్లెపూలు కొంటాడు. ఇంటికి రాగానే నిలువెత్తు అద్దం ముందు అవి నేను అలంకరించుకొంటాను. నా అందం చూస్తూ, నా భర్త నా వైపు కాంక్షగా చూస్తాడు.

నాకు పదహారేళ్ళు దాటిన దగ్గర నుంచి ఈ పదహారేళ్ళ నుంచి నేను ప్రతిరోజూ కంటున్న కమ్మని కల... అలుపు, విసుగు ఎరుగని సుందర స్వప్నం. ఈ ఉద్యోగంతో నిజం కాబోతోంది. నేను మళ్ళీ నోరెత్తకుండా లేచి వచ్చా వచ్చాను. దుప్పటి కప్పుకుని పడుకున్నాను. నా ఎప్పటి స్వప్నం నా ఊహాల్లోకి రాలేదు. ఈసారి నేను నాకు పుట్టబోయే గుడ్డిబిడ్డ గురించి ఆలోచించాను. నాకో గుడ్డిబిడ్డ. వాడు పడుతూ లేస్తూ, ఏడుస్తూ... నేను వాడిని

అల్లారుముద్దుగా పెంచుతాను. నా అరచేతుల్లో, నా గుండెల మీద నడిపిస్తూ. నా గొంతు విని లేచి 'టీచర్' అని పిలుస్తూ వరండాలో స్తంభం కోసం తడుముకుంటూ ముందుకు తూలిన ఏడుకొండలు గుర్తుకొచ్చాడు. అమ్మో... నా బిడ్డను నేనెంత నిస్సహాయంగా వదిలివేయను. వాడికి కొండంత అండగా నేనుంటాను. జీవితంలో వాడు పొందలేని, చూడలేని ఆనందాలన్నింటినీ వాడికి కళ్ళు, కాళ్ళు నేనే అయి చూపెడతాను. నేను నిద్రపోయే ముందు చేసుకున్న శపథం అది. ఆ తరువాత నాకు హాయిగా నిద్ర వచ్చింది.

పొద్దుట శారద స్కూలుకి రాలేదు. క్లాసులో పదిమంది పిల్లలున్నారు. అరిచినా, అడిగినా ఎవరికీ వినిపించదు. నేనే హాస్టల్ వైపు నడిచాను. కాళ్ళు బారజాపి టేబుల్ మీద దరువువేస్తూ కూర్చున్న వార్డెన్‌ను "శారదేదండీ" అని అడిగాను.

"శారదా... ఓహో అష్టావక్రా... ఒసే పోయి ఆ వంకరదాన్ని ఇల్లారమ్మను జల్దీ... పరుగెత్తు... సుధా టీచర్ రమ్మంటున్నారని చెప్పు. కూర్చోండి టీచర్..." మర్యాద చేశాడు వార్డెన్.

మోకాళ్ళ మీద చేతులు వేసుకుని కుంటుతూ వచ్చే పిల్ల వెనుక గదుల వైపు వెళ్ళింది. రిలాక్స్‌డ్‌గా వాలిపోయి పాన్ నములుతున్న వార్డెన్ వంక నేను కాల్చేసేలా చూసే ఉంటాను. నేను కౌశికుడిని కాను... వాడు కాకీ కాదు. నిక్షేపంలా సిమెంటు దిమ్మెలా వాడలా విశ్రాంతి అనుభవిస్తూనే ఉన్నాడు.

"శారదని టెంటుకాడికి తీసుకెళ్ళారు సార్..." ఆ పిల్ల తిరిగి వచ్చింది.

"ఎవర్ని పర్మిషన్ అడిగి తీసుకుపోయారు' వార్డెన్ కోపంగా లేచి సరిగ్గా కూర్చున్నాడు.

"చూడండి టీచర్ ఇదీ వరస. ఒక్కోడికి ఒళ్ళు బలిసి టెంట్లు వేయటమేంటండీ... టెంట్లు... ఈడ నిధి నిక్షేపాలేం వున్నాయండీ..."

నేను లేచి నిలబడ్డాను.

"శారదకు వంట్లో బావులేదండీ... పాపం జ్వరంగా ఉంది. ఆ పాపను అలా తీసుకెళ్ళకపోతే బాగుండేది"

అతను అంటున్న దానికి, నేను చెపుతున్న దానికి పొంతన కుదరక వార్డెన్ ప్రసంగం ఆపేడు.

అతను మళ్ళీ మాట్లాడే లోపునే నేను గబగబా తిరిగి క్లాసుకు వచ్చాను. నేను వచ్చేసరికి హెడ్‌మిస్ట్రెస్‌గారు క్లాసులో ఉన్నారు.

ఏంటండీ సుధా టీచర్... మీరుండగానే బళ్ళోకి చొరబడి పిల్లల్ని టెంటు దగ్గరికి

తీసుకుపోయారా? అదీ నా పర్మిషన్ లేకుండా. రాయండి కంప్లయింట్. కల్టెక్టరుగారి దగ్గరకు పోయ్యార్ల గుంపంతా కలిసి. యాజమాన్యం దురాగతాల గురించి ఈ పిల్ల వెధవల చేత చెప్పిస్తార్ల. ఎంత దారుణమో చూడండీ...''

చూడండీ చూడండీ అంటూనే గంటసేపు ఆవిడ విసుగు, విరామం లేకుండా యాజమాన్యం గొప్పతనం గురించి, తన డిసిప్లిన్ గురించి, టీచర్ల బుద్ధిహీనత గురించి చెప్పుకొచ్చారు. చెవుల్లో ఆవిడ మాటలు జొరబడుతున్నా నా కళ్లనిండా శారదే.

వారంరోజుల జ్వరంతో పాపం డస్సిపోయింది శారద. నిన్న సాయంకాలానికి కళ్ళు జ్వలించిపోతున్నాయి. ఆ రాత్రివేళ కటిక చీకట్లో, జ్వరంతో, ఆకలితో, ఆ పసిది ఎంత అలమటించిందో తలుచుకొన్నాక పదహారేళ్ళుగా నేను రోజూ కనే కల ఎందుకో ఊహల్లోకి కూడా రాకుండా పత్తాలేకుండా పోయింది. ఒకవైపు శారద కోసం, శారద వంటి పిల్లల బతుకుల కోసం, మరోవైపు ఏ అనుభవానికి నోచుకోకుండా ముగింపుకు రాబోతున్న నా బతుకు కోసం మనసు కొట్టుకుపోయింది. మనసుందే అది మహా మాయలేడి. అది గమ్మత్తులు చేస్తుంది. జకిల్ అండ్ హైడ్‌లా నటిస్తుంది కూడా. చివరకు మనకు నిజంగా ఏది సౌకర్యమో, ఆ ఆలోచనకే ఊతమిస్తూ, వ్యతిరేకంగా తలెత్తే ప్రశ్నలకీ, పాజిటివ్ వేలోనే సమాధానాలిస్తూ మనకు లాభం చేకూరుస్తుంది. మనుషులం కదా లొంగిపోతాం. ఉదయాన్నే శారదను చూడాలనుకొని నిద్రపోయాను. పనులన్నీ ముగించుకొని తొందర తొందరగా స్కూల్లో పడితే ఇక్కడ ఇలా జరిగింది. హెడ్‌మిస్ట్రెస్ గారిని పర్మిషన్ అడగాలనిపించినా, అడిగితే అవకాశం వుండదనిపించి సాహసం చేసి ఆవిడ అటు వెళ్ళగానే స్కూలు దాటి బయటపడ్డాను. వచ్చే ముందు నోరెత్తకుండా కూర్చోమని పిల్లలకు ఓ సుగ్రీవాజ్ఞ జారీ చేశాను. ఆ గేటు దాటి వీధిలో పడ్డాక గానీ నాకు ఊపిరి ఆడలేదు. కల్టెక్టరాఫీసు స్కూలుకు దగ్గరే. నడిచెళ్ళే దూరం. అక్కడే మా స్టాఫ్ టెంట్ వేశారు. ఆమరణ దీక్షలో ఉన్నారు. నేను వెళ్ళేసరికి డి.పి.ఆర్.ఓ.గారు వచ్చారు. మా అనసూయ టీచర్ మహావేశంలో జీతాల్లో, పిల్లల తిండిలో, మెయింటెనెన్స్‌లో కోతల గురించి, మేనేజ్‌మెంట్ దుష్కృత్యాల గురించి వివరిస్తున్నారు. నా కళ్ళు శారద కోసం వెతికాయి. అందరికంటే ముందు అదలా వంకర తిరిగిపోయి కుంగి నిలబడి ఉంది. పక్క పిల్లని పట్టుకొన్న దాని చేయి వణకటం స్పష్టంగా కనిపిస్తోంది. అనసూయగారు ఉన్నట్టుండి ఆవేశంగా పిల్లలవైపు తిరిగారు. శారద అందుబాటులో ఉంది. ఆ పిల్ల చేయందుకొని లాగి ముందుకు నిలబెట్టారు.

''చూడండి ఎల్లాగయిపోయారో పిల్లలు. తిండి సరిగ్గా లేదండీ వాళ్ళకి... జీతాల్లేవంటారండీ మాకు... వస్తున్న ఫండ్స్ ఏమయిపోతున్నాయో అడగండి. అసలు మాకు ఇస్తున్నదెంత... వస్తున్నదెంత... చూడండి లెక్కలు... ఆవిడ లాగిన లాగుడికి విసురికి శారద

తూలి పడింది. కాలూనుకొని లేచే శక్తి లేదు. దానికి ఇద్దరు ముగ్గురు పిల్లలు 'శారదా' అంటూ ఆ పాప సాయం కోసం ముందుకు వంగారు. వాళ్ళంతా అంతంత మాత్రం వాళ్ళే. ఒక్క ఊపులో శారదను అందుకొన్నాను నేను. మురికి చేతుల శారద, చెవుల్లో మట్టి పేరుకుపోయిన శారద, గుండు గీయిస్తే గాట్లుగాట్లు పడిన తలతో వికారంగా తయారైన శారదను చేతుల్లోకి తీసుకున్నాక నేను అదే విసురులో వంగి అనసూయ చేయందుకున్నాను గట్టిగా. ఆ చేతుల్లో అంత బలం ఎలా వచ్చిందో తెలియదు. అనసూయ చేయి నా చేతుల్లో ఎంతగా ఇరుక్కుపోయిందంటే ఆమెను ఎలా వదలాలో నేను మరిచిపోయానన్నమాట. భాష పుట్టక పూర్వం మానవులు తమ కోపతాపాలను, సంతోషాలను ఏ భాషలో పరస్పరం వ్యక్తం చేసుకొన్నారో అదే భాషలో నేను అనసూయతో మాట్లాడే ఉంటాను.

'ఆడదాన్ని కాబట్టి కాస్త దయగా ఉంటాననీ, పిల్లల్ని ఏమన్నా నేను సహించననీ, పిల్లల్ని కన్నబిడ్డలా చూస్తాననీ' ప్రాణం జిలార్చుకు పోతున్న గొంతుతో నన్ను వదిలించుకోలేక ఆ అధికారి ముందు బయటపడలేక అనసూయగారు కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయారు. భవిష్యత్తులో నేను కనబోయే గుడ్డిబిడ్డను, నా గారాల కూనను శారదలో ఊహిస్తూ, ఆ పసిదాన్ని నా దగ్గరకు తీసుకుంటే నా కాళ్ళు, చేతులు, నడుం అన్నింటిని తాకుతూ ఎన్నెన్నో స్పర్శలు. మమకారానికి భాష లేకపోతేనేమి? ఇప్పుడు నేను నిస్సందేహంగా ప్రవాహం అయిపోయా. చుట్టూ టీచర్లు, అధికారులు చూస్తున్నారని నాకు సిగ్గులేదు. నన్ను నేను భరించలేకనే ఏడుస్తున్నానని నాకే తెలుసు. మామూలుగా ఆడవాళ్ళు ఏం చేసినా, వాళ్ళ చుట్టూ గాలి కబురొకటి సిద్ధంగా ఉంటుంది. కన్నీళ్ళు పెట్టుకొంటే సున్నితత్వం, ఉక్రోషం వచ్చి మామూలు మనుషుల్లాగే జుట్టు జుట్టు పట్టుకొని కొట్టుకుంటే సెన్సేషన్. ఇంకోటి... ఇంకోటి వాళ్ళ ప్రతీ ప్రతిస్పందనకూ ఓ అందమైన కోటింగ్.

అలా నా కన్నీటికి ప్రభుత్వం కరిగిందంటే – నమ్మండి. ఇప్పుడు మాకు కొత్త ఫండ్స్ శాంక్షన్ అయ్యాయి. అన్నట్లు నేను పర్మనెంట్ అయ్యాను.

అందరూ అనుకొన్నట్లే కథ సుఖాంతమైంది అన్నట్లు ఆ తరువాత నా పెళ్ళయింది కూడా. శారద ఇప్పుడు మూడో తరగతిలోకి వచ్చింది. ప్రతిరోజూ ప్రార్థనా గీతం శారదే పాడుతుంది. 'నా తప్పులు మన్నించి నాకు అన్నం ప్రసాదించు దేవా' అని జాలిజాలి గొంతుతోనే ఆ పాట పాడుతోంది. రాత్రివేళల్లో హాస్టల్లో కరెంటు తీసేస్తున్నారు. మొన్నా మధ్య జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ విషయం గురించి నిర్ణయం సరిగానే వుందనుకొన్నాం. కరెంటు చార్జీలు మరి పెరిగిపోలేదూ! ఇప్పుడు వార్డెన్‌గారు రిటైరైతే క్వాలిఫికేషన్ల పరంగా చూస్తే నేనే వార్డెన్ అవచ్చు. అప్పుడే ఎంతెంత శాతం ఎవరెవరికి రావాలో చిన్న ఊహాగానం చేశాం నేనూ, మావారూనూ. వారు బడ్జెట్ విషయంలో చాలా పర్‌ఫెక్ట్. శారదంటే మటుకు నాకు మహా ఇష్టం సుమండీ!

ఆ పిల్ల గొంతు జాలిగా, ఆకలిగా వినిపించినప్పుడల్లా నాకు కళ్ళనీళ్ళు వచ్చేస్తాయి. అలాగే దేకుతూ నడుస్తాడే ఏడుకొండలూ, ఏసూ, ఇప్పుడు నా అడుగుల సవ్వడి వినగానే ఇట్టే గుర్తు పట్టేస్తారు. సుధ టీచర్ అంటూ నవ్వేస్తారు. ఎందుకోనండీ క్లాసంతా ప్రాబ్లమాటిక్‌గా ఉండి మాకు చిరాగ్గా ఉంది. ఇప్పటికీ కడుపునొప్పి కంప్లయింటేనండీ వాళ్ళకి. ఎప్పుడూ వాంతులయిపోతుంటాయి. ఎందుకో మరి!!

★

ఆదివారం ఆంధ్రజ్యోతి

***19.11.1997***